ఖర్చుదారీతనాన్ని తృప్తిపర్చేంత డబ్బుంటూ లేక పోవడం, ఎలావచ్చినా సరే డబ్బే ప్రధానం అనే ప్రలోభానికి మానవుడు గురికావటం, శీలాన్ని అమ్ముకొని డబ్బార్జించడం, నాలోని చుట్టూ ఆవరించుకున్న ఈ దుర్వ్యామోహం, మానవ సంఘానికే చీడపురుగని సుళువుగా తేలిపోయింది. ఆఖరికి నా బిడ్డలుకూడా ఎప్పుడో ఒకప్పుడు 'అందరి తలలూ కొట్టి తెచ్చిన డబ్బు'అని నిందించకమానరు. ఆఫీసులో ప్రజ నా అధికారానికి జడిసి గౌరవిస్తున్నారు. వారి హృదయాల్లో, బందీపై నేరస్థుడిపైన ఉన్నపాటి గౌరవంకూడా లేదు...అన్న ఆలోచనలు సాగిపోయాయి.

దూరాన రెండుగంటలు కొట్టారు. ధైర్యంగా 'దోషిని' అనిచెప్పి శిక్ష తీసుకోడం ఎంతమనసుని దిద్దపర్చుకున్నా జరగని పని. రాత్రి కలతనిద్రలో నేనేదో తెలీని రోగంతో బాధపడుతోన్నట్లు ప్రజలంతా 'పాపపు సొమ్ము తింటే ఏమౌతుందని' సాధిస్తూన్నట్లు విని హడలి పోయాను . తెల్లారింది. లేస్తూనే ఒక నిశ్చయానికి వచ్చాను. నా చేతులతో నేను 'దోషిని' అని వ్రాసి ప్రభుత్వానికి పట్టుపడడం చేతకాని పని. కాని ఇనుప పెట్టెలో పదిలపర్చిన లాంటి నా ప్లాన్లని భేదించామని సంతోషపడే పోలీసులకి సంతోషాన్ని చేకూర్చగలను...కన్ను తెర్చుకొని మరీ పద్మవ్యూహంలో పడ్డానని మీకు తెలియపర్చడానికే ఇది వ్రాసింది కూడా. బహుశా ఇది మీవరకూవచ్చేసరికి వార్తాపత్రికలు నాకేమైందో కూడా తెలియపర్చే ఉంటాయి. ఇప్పుడు నా హృదయం తేలికపడింది. నేను ఇనప ఊచల వెనకాల్నించి దేశాన్ని చూస్తే కాస్త తేజస్సేదన్నా కనపడుతుందేమో!

---

కథానిక

# బంజర్ల పంపిణీ పథకం

## పట్టెల విజయలక్ష్మి

బతుకులు భారంగా బాధగా నడుస్తున్నాయి.

పేదకు గడ్డుదినాలు. రోజు గడవటం ఎంతో కష్టంగావుంది. కష్టపడకుండా కోట్లు సంపాదించే జమీందార్ల జేబులు నిత్యం నిండుతూనేవున్నాయి. బ్లాకుమార్కెట్టులో బ్లాకులకు బ్లాకులే నింపేస్తున్నారు ధాన్యం. బజారులో గింజ కనపడదు. పేదకు పొట్ట గడిచేవిధం కనపడదు.

రోజులు మారాయి. కరువు కష్టంకొంతతగ్గించి మన ఆహారధాన్యాల కొరత తీర్చింది. కొనటానికి కానిడబ్బు కరువయింది. ఎటుచూచినా పేద మీదే దండయాత్ర. ఎటుచూచినా పేదకెలాంటి లాభం కనుపించటంలేదు. ఆంధ్రరాష్ట్రం వచ్చిందన్నారు పెద్దలు. వేడుక చేసుకున్నారు పేదలు. పండుగ చేసుకునేందుకు ప్రభుత్వం దగ్గరచేసిన బాకీలు తీర్చలేక కొరత బడ్జటుతో కృంగిపోతున్నారు గుమాస్తాలు. బి. ఏలు ఎం. ఏలు చదవటానికి ఉన్నదికాస్తా తగలెట్టి ఉద్యోగంలేక ఊర్లో చేసేందుకేమీ పనిలేక, ఇంట్లో రోజు గడిచేదిలేక పేపర్లోపడ్డ ప్రతి ప్రకటన అతి జాగ్రత్తగా చూస్తున్నారు యువకులు. కండక్టరు ఉద్యోగానికి కలక్టరు కావాలనుకున్న వారి దరఖాస్తులు. గుమాస్తా వుద్యోగానికి గుంటూరు చుట్టూ ప్రదక్షిణాలు. ఎటుచూచినా నిరుద్యోగం.

ప్రక్కింటివాళ్ళు చూడబోతే అవస్థంతా వాళ్ళదే అయినట్లు 'అమ్మా! అబ్బాయి ఏమిచేస్తున్నాడని' అడగటం...చదివి ఇంట్లో కూర్చున్న కొడుకును పోషించేందుకు కూడా శక్తిలేక విసిగిన తల్లిదండ్రులు 'ఏముందమ్మా వుద్యోగం వచ్చింది లేకపోయినా ఊర్లన్నీ ఆ యింటర్వ్యూ అని, అదని, యిదని తిరగటానికి చాలటంలేదు ఎక్కడి డబ్బుకూడా' అని విసుక్కోవటం. 'అయ్యో! ఏదైనా ఉద్యోగం చేస్తున్నాడేమోనని మొన్న మా మేనత్తవచ్చినపుడు, తన పిల్లనిస్తాను కనుక్కోమనందమ్మా!" అంటూ ప్రక్కింటావిడ మూతి విరవటం-వింటున్న, చూస్తున్న చదువుకున్న యువకులు "ఎందుకురా యీ జీవితాలు, ఎందుకూ

"పనికిరాని యీ విద్యాపత్రాలు" అని నిస్పృహ చెందటం-రోజూ ప్రతిఇంట్లోను వినిపిస్తున్నగొడవలే. ప్రతి ఆంధ్రనగరంలోనూ పల్లెలోనూ కూడా...

అలాంటి వూరే మారుమూలగా వుండే మా క్షారుమూరుకూడా! కాని కడుపుకి లేనపోయినా కష్టపడి చదవటంలో మాత్రం మా వూరు విద్యార్థులు ఏమాత్రం తీసిపోరు. అది వాస్తవం... ఆ వాస్తవంలో భాగస్తుడైన పదిరోజుల గుమాస్తాగిరీ వెలిగించి రైలుఖర్చులకో ఇరవై బాకీపడ్డ గుమాస్తాలు కోపగించ రనుకుంటాను. బాధపడే కుటుంబాల్లో ఒక సామాన్యమయిన కుటుంబం వెంకటేశ్వర్లుది కూడా!...

బంజర్లపంపకాలు-దానికి పథకాలు తయారయాయి. ముందు కొంచెం సారవంతమయిన భూములన్నీ కాంగ్రెసువాదులూ జాగీర్దారులు, గ్రామసర్దారులు అయిన పెద్దలకు వారుచేసిన, చేస్తున్న సేవకు కానుకగా పంపకాలు జరిగాయి. ఇక మిగిలిందల్లా రోజుకు 28 గంటలు పనిచేసి కష్టపడి, బాకీచేసి వేసిన గింజలకంటె ముందుగా తుంగ మొక్కలు మొలిచి, కోస్తుంటే కొత్త ఆకుతొడిగే బ్రహ్మకలువ మొక్కల్తో బాధపెట్టే బీళ్లు...అందుకుగాను కలక్టర్లకు తాఖీదులందాయి. సక్రమమయిన పద్ధతుల్లో పంపకాలు జరిగేందుకుగాను, దరఖాస్తుకు నంబరు యిచ్చినందుకు రూ 25/- లకు తక్కువలేకుండా వసూలుచేసే దేశభక్తి పరాయణులయిన కరణాల సహాయంతోను, గుడిని గోపురాన్నికూడా మింగగలమని రేషనింగురోజుల్లో రుజువుచేసిన రివెన్యూ యిన్‌స్పెక్టరులను వుపయోగించుకొని...యీ పాపమంతా నెత్తినేసుకొని మోసేందుకు కావలసిన గుమాస్తాలను నియమించవలసిందిగా.

అదనుకోసం తమ కలాలను దులిపి పదునుగా వుంచుకున్న నిరుద్యోగులు కలెక్టర్లు గుక్క తిప్పుకోకుండా దరఖాస్తులు ఆఫీసు రికార్డు రూమంతా నిండేట్లు పంపించారు. అందులో అభాగ్యుడు వెంకటేశ్వర్లుకూడా ఒకడు. ఉన్నకొద్ది ఖాళీలకు విద్యావిషయిక యోగ్యతాపత్రాల్ని చూసి యిచ్చేదుంటే ఎం. ఏ. చదివిన వాళ్ళకోసమే చాలని ఆ ఖాళీలకోసం ఎందుకు ప్రాకులాడ్డం అని నిరాశతో, నిస్పృహతో ప్రయత్నం మానకుండా తన దరఖాస్తు పంపటం మంచిదే అయింది వెంకటేశ్వర్లుకు. తను కలలోకూడా అనుకోలేదు తనకు కలెక్టరుతో ముఖాముఖి మాట్లాడే భాగ్యం కలుగుతుందని... వెంకటేశ్వర్లుకుకూడా వచ్చింది కాయితం, కలక్టరుతో యింటర్వ్యూకు రమ్మని. వార్త వూరంతా గుప్పుమంది, వెంకటేశ్వర్లుకు ఏదో పెద్ద వుద్యోగం వచ్చిందని. బాకీచేసిన డబ్బుతో బయలుదేరాడు. ఇంటర్వ్యూ సవ్యంగానే జరిగింది. కాని వెంకటేశ్వర్లుకు వింతగా తోచింది తనకు వుద్యోగం యిచ్చినట్లు ఆర్డరు వచ్చినప్పుడు-వచ్చిన బి. ఏలను ఎం. ఏలను, ఎం.ఎస్.సి లను (ఎం.ఎస్.సి అంటే యిక్కడ సర్వీసు కమిషనులో ప్యాసయి సెలెక్టయినవాడని అర్థం) కాదని తనకు వుద్యోగం రావటం నిజంగా ఆశ్చర్యంగా వుంది.

వెంకటేశ్వర్లు తండ్రి తన కొడుకేదో పెద్ద వుద్యోగానికే పోతున్నట్లు సంతోషపడ్డాడు. తనకు బట్టలులేవు, కానీకి కానీ దాచి తన బట్టలకోసం దాచుకున్న 20 రూపాయలు యిచ్చాడు. తనకు చింకిపేలిక లయితేమాత్రం ఎవరు చూడబోయారు అని సరిపెట్టుకున్నాడు తనకు తను—

ఉద్యోగంలో చేరడానికి పల్నాటిసీమ బయలుదేరి వెళ్ళాడు ఆర్డరు చేతబుచ్చుకొని. స్టేషన్లో దిగగానే భయపడ్డాడు పాపం ఆ పరిసరాల్ని చూచి. ఆ వూళ్ళో ఇంతవరకు ఏ గుమాస్తాకూడా పట్టుమని పదిరోజులు పనిచేయడని చెప్పేసరికి ఎందుకు చెప్పా! అంటూ చేతిలో సంచీతో తనతోపాటే రైల్లోవచ్చిన మిగిలిన నలుగురు మిత్రులతో బయలుదేరి తాలూకాఫీసుకు చేరుకున్నాడు వెంకటేశ్వర్లు.

తలకు ఒక తువాలుచుట్టి పాతకాలమునాడు కుట్టించిన చాలీచాలని కోటు వేసుకున్న ఒక ఆసామీ టేబిల్ మీద కాళ్ళు పారేసి విశ్రాంతిగా ఏదో ఆలోచిస్తున్నాడు.—"ఇక్కడ తాలూకా ఆఫీసులో హెడ్ గుమాస్తాగారెక్కడ వుంటారండీ" అంటూ ఐదుగురం అయిదుసార్లు పిలిచిన తర్వాత యింతసేపటినుంచి దేన్నిగురించో దీర్ఘంగా ఆలోచిస్తున్న ఆ ఆసామీ ఒక్కసారిగా ఆశ్చర్యపడి "రండి, రండి-నేనేనండి యిక్కడ హెడ్ క్లార్కు-ఇంతకూ ఏమిపనిమీద వచ్చారు?" అంటూ ప్రశ్నించాడు.

చేతులోవున్న ఆర్డరు కాయితాలు ముందు పడేశాం; "అల్లాగా! కూర్చోండి, కూర్చోండి... యీరోజు పనిలో చేరినట్లు కాయితం రాసియిచ్చి మీరు వూళ్లో భోజనానికి వగయిరా వసతులు చూచుకొనిరండి, మీమీ పనులు రేపు విపులంగా చెపుతానన్నాడు- హెడ్ గుమాస్తాగారు. ఆయన చెప్పినట్లు చేసి వూళ్లోకి బయలుదేరారు. ఒక చిన్న సందులోనుంచి బయలు దేరారు. ప్రక్కనే వున్న చెత్తలో ఏదో బరబర్లాడింది. "అమ్మ బాబోయ్!" అన్నాడు క్రొత్తగా వాళ్ళతోపాటే వుద్యోగానికి వచ్చిన కృష్ణమూర్తి. త్రాచు ప్రక్కనేవున్న కలుగులోకి తప్పుకుంది.

ఒకహోటల్లో నెలకు రూ. 30-లు యిచ్చే ఒప్పందంమీద భోజనానికి కుదుర్చుకున్నారు. కాని ముప్ఫయి రూపాయలు...కొంచెం పెద్ద మొత్తంగానే బాధపడ్డారు. సాయంత్రం భోంచేసిం తర్వాత త్రేన్చుకుంటూ అనుకున్నారు ముప్ఫయి రూపాయలు దండుగలేదులే అని; అత్తగారింటి విందులా వుందని. తాలూకాఫీసు దగ్గర్లోకే ఒక చిన్న డాబాయిల్లు అద్దెకు దొరికింది. అసలది సత్రమయినా అద్దెవసూలు అతి జాగ్రత్తగా జరుగుతుంది. రోజుకు పావలా అద్దె.

నిద్దరపట్టిందప్పుడే. "అమ్మ బాబోయ్!" అని లేచాడు సుబ్బారావు.

"ఏమిటిరా! ఏమిటిరా?" అన్నారందరూ.

"ఏదో నామీద నిద్రపోతుంది చూడరా" అన్నాడు సుబ్బారావు. మూలనున్న క్రొవ్వొత్తి వెలిగించటానికి పోయిన కృష్ణమూర్తి "అమ్మో! చచ్చానురా! ఏదో కుట్టింది" అన్నాడు. అగ్గిపుల్ల గీసి చూస్తే అదో మండ్రగబ్బ-కొవ్వువత్తి వెలిగించినా యింకా సుబ్బారావు మీదనుంచి కదల్లేదు గబ్బిలం. అప్పుడు కనబడ్డాయి గోడలనిండా గబ్బిలాలు. ఓహోహో! ఏమిజీవితంరా బాబూ! గబ్బిలాలతో కాపురం! తేళ్ళతో మండ్రగబ్బల్తో సహవాసం...

ఆఫీసులో చార్జి తీసుకున్నాడు వెంకటేశ్వర్లు. ముఖ్యంగా కొన్ని బంజరుభూముల తాలూకు రికార్డు, కొన్ని ముఖ్యమయిన ఫైళ్లు ఎక్కడా కనుపించలేదు. ఇదేమిటండీ అని అడిగితే 'వాటి విషయం మీరడిగితే నేను చెపితే యిద్దరకూ ప్రమాదమే! అవి లేకపోయినా వున్నట్లే ఒప్పుకో' మన్నాడు హెడ్ క్లర్కు.

అంతా వింతగా విచిత్రంగా తోచింది, తర్వాత ఆలోచిస్తే తెలిసింది. ఆ రికార్డులు, ముఖ్యమయిన ఫయిళ్లు అసలు బంజరు భూముల లెక్కల్లోంచి తీసివేయాలని, ఆ భూములన్నీ ఏనాడో ముఖ్యమైన ఘరానా మనుష్యుల పేర రిజిష్టరయ్యాయనీ... ప్రభుత్వ యంత్రాంగమంతా ఇట్లా. ఇక మంత్రులు చెప్పే కబుర్లు చూడబోతే రేపు అందబోయే స్వర్గం నేడే చూచినట్లుంటుంది. ఆర్థికమంత్రులు చూడబోతే అంకెల్లో గారడీ చేసేస్తున్నారు. ఇలాంటి ప్రభుత్వాన్ని ఎలా నమ్మటం...ఇలాంటి ప్రభుత్వంనుంచి ఏమిటి ఆశించటం? అంటూ ఆలోచిస్తూనే గడిపాడు తొమ్మిదిరోజులు వెంకటేశ్వర్లు.

పదవరోజు ఆఫీసుకు పొయ్యేసరికి టేబిల్ మీద కలెక్టరుగారు పంపిన 'వుద్యోగపు తీసివేత' కాయితం కనిపించింది. ప్రస్తుతానికి బంజరు పంపకాలు ఆపివేసినందువల్ల ఆ కార్యక్రమానికి నియమించబడ్డ వుద్యోగులను తీసివేస్తున్నట్లు-ప్రభుత్వానికి 'ఆర్థికలోటు' వుంది కాబట్టి, ప్రస్తుతానికి పని ఆగింది కాబట్టి-పరిస్థితులు సానుభూతితో ప్రజలర్థంచేసుకోవాలని ఒక మంత్రిగారి ఉవాచ... కొంతకాలం యీ కార్యక్రమం ఆపుచేయటానికి కారణం ముఖ్యంగా 'ఏవయినా యింకా తీసుకోకుండా మిగిలిన సారవంతమయిన భూములా!' అని సామాన్యుడు సందేహపడ్డాడు. వెంకటేశ్వర్లును పిలిచి పదిరోజుల జీతం రూ 25-5-4 లు యిచ్చి ఇంటికి దయచేయమన్నారు.

సాయంత్రం బాకీ తీర్చటానికిపోయి హోటలు వాడితో ఘర్షనపడి యింటికి వచ్చేందుకు టిక్కట్టు కొనుక్కోగా మిగిలిన 0-1-0 ఒక అరకప్పు టీ త్రాగి, నిరుత్సాహపడ్డ ఆ కళేబరాన్ని రైలు పెట్టెలో పడేశాడు.

పదిరోజుల వుద్యోగానికి తనుపడ్డశ్రమ తలచుకొని, ప్రభుత్వం అసమర్థతకు కుములుతూ యింకా పల్లెటూరులోనే వున్నాడు.

ఇది ఒక జరిగిన ఘటన. ఇందులో ఎవరినటనా ఏమీలేదు...ఎవరైనా ఏ చిన్న ఉద్యోగం యిస్తామన్నా రావటానికి వెంకటేశ్వర్లు తయారే-యీ రోజుకికూడా!

★